నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్ - మేడ్చల్
I హైదరాబాద్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 HYDERABAD

## మరో రెండు రోజులు వర్షం



### గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావంతో గ్రేటర్‌లో ఆదివారం సాయంత్రం పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 9గంటల వరకు ఉప్పల్ బండ్లగూడలో అత్యధికంగా 2.15సెం.మీలు, లింగోజిగూడలో 1.78, నాగోల్‌లో 1.75 , వనస్థలిపురంలో 1.40సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం రాగల 24గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశాలున్నాయి. దీంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 32.0డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21.4డిగ్రీలు, గాలిలో తేమ 65 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## దామగుండాన్ని రక్షించుకుందాం..



దామగుండం అటవీ ప్రాంతాన్ని కాపాడాలని ఆదివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ ధర్నాకు పలువురు పర్యావరణ ప్రేమికులు మద్దతు తెలిపారు. 'పన్నెండు లక్షల చెట్ల నరికివేతను అడ్డుకుందాం..దామగుండాన్ని కాపాడుకుందాం', 'పచ్చదనాన్ని కాపాడండి.. పసి పిల్లలకు ఊపిరివ్వండి' అంటూ పర్యావరణ ప్రేమికులు ప్లకార్డులు చేతబూనారు. ఇందులో భాగంగా ఓ పర్యావరణ ప్రేమికుడు తులసి మొక్కకు ఆక్సిజన్ పైపు బిగించి వినూత్నంగా ఇలా నిరసన తెలిపాడు.

# పేదలపై హైడ్రా పగ..



## సామాన్యుడిపైనే 'హై'డ్రా ప్రతాపం..!!

- కూల్చివేతల్లో ద్వంద్వ వైఖరి
- కూకట్‌పల్లి నల్లచెరువు ఎఫ్‌టీఎల్ లో 16 ఆక్రమణల తొలగింపు
- స్థల యజమానులు సేఫ్... కిరాయి తీసుకున్న వారికి తీరని నష్టం
- జరిగిన నష్టం ఎవరు తీరుస్తారని ప్రశ్నించిన బాధితులు

*ప్రజాపాలనలో సామాన్య, మధ్య తరగతి ప్రజలే లక్ష్యంగా సర్కారు దాడి కొనసాగుతున్నది. తెల్లవారుజామున నిద్రలేవక ముందే ఇండ్లు, చిరు వ్యాపారం చేసుకునే దుకాణాలపై దాడులు చేయిస్తూ ప్రభుత్వం హైడ్రామా చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ నేతలు, పలుకుబడి ఉన్న వ్యక్తులకు నోటీసులతో సరిపెడుతున్న సర్కారు.. పేదోడి గూడుపై మాత్రం కర్కశంగా వ్యవహరిస్తున్నది. కూల్చివేతల్లో సమన్యాయం పాటించాల్సిన హైడ్రా మరోమారు కూకట్‌పల్లి నల్లచెరువు వేదికగా ద్వంద్వ వైఖరిని ప్రదర్శించింది.*



సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ ) : కూకట్‌పల్లి గ్రామంలోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలపై హైడ్రా పంజా విసిరింది. ఆదివారం తెల్లవారుజామునే కూల్చాల్సిన నిర్మాణాల వద్దకు హైడ్రా బృందంతో పాటు రెవెన్యూ, జీహెచ్ఎంసీ, ఇరిగేషన్ శాఖల అధికారులు పోలీసు బలగాలతో రంగంలోకి దిగారు. నల్లచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో గుర్తించిన 16 ఆక్రమణలను(రేకుల షెడ్డులను) జేసీబీలతో నేలమట్టం చేశారు. ఏడు గంటలకు మొదలు పెట్టి 11 గంటల వరకు అనుకున్న విధంగా నిర్మాణాలను కూల్చివేశారు. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి అంతా... ప్రైవేట్ వ్యక్తులకు చెందిన పట్టా భూములు కాగా, ఆ భూములను కిరాయికి తీసుకున్న పేద ప్రజలు నడిరోడ్డున పడ్డారు.


### ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ..

మారుమూల గ్రామాల నుంచి నగరానికి వచ్చి, జీవనోపాధికి ఎవరిపై ఆధారపడకుండా పనులు చేసుకుంటున్నారు. మరి కొందరికి ఉపాధి ఇవ్వాలన్న లక్ష్యంతో తక్కువ కిరాయికి స్థలాలను తీసుకుని రేకుల షెడ్డులను నిర్మించుకున్నారు. రేకుల షెడ్డులలో టెంట్ హౌజ్ సామగ్రి, క్యాటరింగ్, ఫ్లెక్సీలు తయారీ చేసే కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కసారిగా పేదల జీవితాలపై హైడ్రా పేరుతో కొరడా ఝులిపించగా.. ఆ ప్రాంత ప్రజలంతా బెంబేలెత్తారు. మాకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలను ఎలా కూల్చుతారని, ఆక్రమణలు చేసిన వారిపై కాకుండా మాలాంటి పేదలపై ప్రతాపం చూపడం సరికాదని వేడుకున్నారు. మాకు తెలియక రేకుల షెడ్డులు నిర్మించుకున్నామని, అందులో ఉన్న సామగ్రి తీసేందుకు సమయం ఇవ్వాలని అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరించలేదని వాపోయారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన వారిని పక్కకు తోసేశారు. ముందస్తు సమాచారం లేకుండా కూల్చివేతలు చేపట్టగా.. ఆ నిర్మాణాలను నేలమట్టం చేయడంతో లక్షల విలువైన వస్తువులు ధ్వంసమయ్యాయని బాధితులు బోరున విలపించారు.

### అసలు తప్పు ఎవరిది..?

కూకట్‌పల్లి నల్ల చెరువు విస్తీర్ణం 30 ఎకరాలు ఉండగా.. కేవలం 7.36 ఎకరాల స్థలం మాత్రమే చెరువు శిఖం భూమి ఉంది. ఈ చెరువులో మిగిలిన స్థలం పై ప్రైవేట్ వ్యక్తులు పట్టాలు కలిగి ఉన్నారు. చెరువులో ఉన్న పట్టా భూముల్లో నిర్మాణాలు మొదలు పెట్టారు. గతంలో చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ ప్రాంతాల్లో నిర్మాణాలకు అనుమతులు కూడా లభించాయి. తాజాగా, నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో చెరువులో పట్టాలు కలిగిన వ్యక్తులు పట్టా స్థలాన్నీ ప్లాట్లుగా మార్చి భవనాలు, రేకుల షెడ్లను నిర్మించారు. కొందరు వ్యక్తులు పట్టా భూములను పేదలకు అమ్ముకోగా.. మరికొందరు కిరాయిలకు ఇచ్చారు. బతుకు దెరువుకు నగరానికి వచ్చిన పేదలు తక్కువ కిరాయికి వస్తుందని.. చెరువు ఎఫ్‌టీఎల్ స్థలం అని తెలియక... యజమాని వద్ద కిరాయికి మాట్లాడుకున్నారు. సొంత ఖర్చులతో రేకుల షెడ్డును నిర్మించుకున్నారు. ఈ రేకుల షెడ్డుకు ఆస్తిపన్ను కట్టించుకుంటున్నారు. నల్లా, విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో ప్రతినెలా బిల్లులు చెల్లిస్తున్నారు. ఒక్కసారిగా హైడ్రా అధికారులు వచ్చి ఆ నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో జీవనోపాధి కోసం నిర్మించుకున్న గూడు నేలకొరగడంతో ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడి విలపించడం అందరినీ బాధించింది. ఈ వ్యవహారంలో ప్లాట్ల యజమానులకు శిక్ష పడలేదు. కిరాయికి తీసుకున్న పాపానికి పేదలకు శిక్షపడింది. ఈ నష్టాన్ని ప్రభుత్వం తీరుస్తుందా? ఇన్నాళ్లు అద్దెలు తీసుకున్న యజమానులు భరిస్తారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## నల్లచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలు



కూకట్‌పల్లి మండలంలోని నల్ల చెరువు విస్తీర్ణం మొత్తం 30. 31 ఎకరాలుగా రికార్డుల్లో నమోదైంది. ఈ చెరువులో ప్రభుత్వ శిఖం భూమి 7.36 ఎకరాలు ఉండగా... మిగిలిన 26 ఎకరాల భూమి ప్రైవేట్ వ్యక్తులు పట్టాలు కలిగి ఉన్నారు. నల్ల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో 18.02 ఎకరాలు, బఫర్‌జోన్‌గా 4.29 ఎకరాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. కాగా, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో సుమారు ఏడెకరాల వరకు ఆక్రమణలు వెలిశాయి. ఎఫ్‌టీఎల్ పరిధిలో మూడెకరాల్లో 25కు పైగా భవనాలు... 16 వరకు షెడ్డులను గుర్తించారు. బఫర్ జోన్ పరిధిలో నాలుగెకరాల స్థలంలో 50 వరకు నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాగా ఆదివారం హైడ్రా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుర్తించిన 16 అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. త్వరలోనే ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మరిన్ని నిర్మాణాలను తొలగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## 8 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నాం



ప్రభుత్వ స్థలాలు, చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో వెలిసిన అక్రమ కట్టడాలపై హైడ్రా ఆదివారం మూడు చోట్ల కూల్చివేతలు జరిపి, 8 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కేవలం వ్యాపారం కోసం నిర్మించిన భవనాలను మాత్రమే కూల్చివేశామని, నివాసం ఉంటున్న వారి జోలికి వెళ్లలేదని స్పష్టం చేశారు. కూకట్‌పల్లి నల్లచెరువులోని సర్వే నంబర్ 66, 67, 68, 69లోని మొత్తం 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీలు కూల్చినట్లు కమిషనర్ పేర్కొన్నారు. మొత్తం నాలుగు ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోనూ ఆక్రమణలు కూల్చివేశామని, కిష్టారెడ్డి పేటలోని సర్వే నం.164లో మూడు భవనాలను కూల్చేవేశామన్నారు. వాణిజ్యపరంగా వినియోగిస్తున్న ఐదంతస్తుల భవనాన్ని కూల్చినట్లు చెప్పారు. ఒక ఎకరాన్ని స్వాధీనం చేసుకున్నామని కమిషనర్ పేర్కొన్నారు. పటేల్‌గూడ సర్వేనంబర్ 12/2, 12/3లోని 25 నిర్మాణాలను కూల్చివేసి 3 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించినట్లు కమిషనర్ తెలిపారు.

*- ఏవీ రంగనాథ్, హైడ్రా కమిషనర్*

## భారీ వర్షం..విద్యుత్ వ్యవస్థ ఆగమాగం



### అర్ధరాత్రి వరకు పూర్తి కానీ పునరుద్ధరణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ వ్యవస్థ ఆగమాగమైంది. చాలా చోట్ల చెట్లు కూలిపోగా, వాటి కొమ్మలు విద్యుత్ తీగలపై పడ్డాయి. అలాగే కొన్ని చోట్ల గాలులకు భారీ హోర్డింగ్‌లపై నుంచి ఫ్లెక్సీలు ఎగిరిపోయి 33 కేవీ లైన్లు, 11 కేవీ లైన్లపై పడటంతో చాలా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై చెట్లు కూలడంతో అవి విరిగిపోయాయి. ముఖ్యంగా బంజారాహిల్స్, సికింద్రాబాద్, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్లతో పాటు రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొన్ని గంటల పాటు కరెంటు లేదు. కాగా విద్యుత్ సరఫరా లేని ప్రాంతాలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పర్యవేక్షించారు.

### గంటలు గడిచినా రాని కరెంటు...

వర్షం నిలిచిన తరువాత నగరంలో ఓ వైపు ట్రాఫిక్, మరో వైపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం అలుముకున్నది. కొన్ని చోట్ల వర్షం ఆగిపోయి 2 గంటలు గడిచినా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించలేదని వందలాది మంది ట్విట్టర్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రేటర్‌లో విద్యుత్ నెట్‌వర్క్ చాలా చోట్ల దెబ్బతినడంతోనే పునరుద్ధరణ పనులు ఆలస్యమైనట్లు విద్యుత్ శాఖ అధికారులు ప్రకటించారు. వర్షంలోనే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది కరెంటు స్తంభాలు ఎక్కి తీగలపై పడిన చెట్ల కొమ్మలు, ఇతర వస్తువులను తొలగించారని తెలిపారు. రాత్రంతా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేశారని విద్యుత్ అధికారులు తెలిపారు.

## మక్త గ్రామంలో భారీ చోరీ..

- ఇంట్లో ఉన్న రూ.2కోట్లు, 28 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- క్లూస్ టీంతో పోలీసుల దర్యాప్తు ముమ్మరం

ఘట్‌కేసర్, సెప్టెంబర్ 22 : పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్ పరిధిలో దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఇంట్లో ఉన్న రూ.2కోట్లు , 28 తులాల బంగారు ఆభరణాలను తస్కరించారు. పోలీసుల కథనం ప్రకారం.. చౌదరిగూడ సమీపంలోని మక్త గ్రామానికి చెందిన నాగభూషణం (76) కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరు విదేశాల్లో ఉంటున్నారు. కాగా నాగభూషణానికి చెందిన భూమి శంకర్‌పల్లిలో ఉండగా అమ్మకానికి పెట్టాడు. అడ్వాన్స్‌గా ఇచ్చిన రూ. 2 కోట్లు ఇంట్లో దాచిపెట్టాడు. దొంగలు ఆదివారం తెల్లవారుజామున రెండు కోట్ల రూపాయలు, 28 తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. సోమవారం బ్యాంకులో డిపాజిట్ చేయాలని బాధితుడు అనుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి ఆధ్వర్యంలో పోచారం సీఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీంతో దొంగతనానికి సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

## బయటి ఫుడ్ ప్రమాదకరం

### గడువు ముగిసిన వస్తువులతో ఆహారం తయారీ



సిటీబ్యూరో, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని వ్యాపారులపై ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమాజిగూడ జల్‌పాన్ రెస్టారెంట్‌లో వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. పుట్టగొడుగులు, నువ్వుల నూనె, పాల ప్యాకెట్ తదితర ఆహార ప్యాకెట్లు గడువు ముగిసినట్లు తనిఖీలో తేల్చారు. వంటగది కిటికీకి అమర్చిన మెష్‌లో పావురం రెట్టలు ఉండి దుర్వాసన వెదజల్లుతున్నట్లు నిర్ధారించారు. దీంతో పాటు పంజాగుట్ట మెరిడియన్ రెస్టారెంట్‌లో వంటగది ప్రాంగణం అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించారు. బిర్యానీ తయారు చేసే ప్రాంతంలో నీరు నిలువడం, ఫ్రిజ్‌లో ఉన్న వస్తువులకు లేబుల్స్ సరిగా లేవని తేల్చారు. సంబంధిత నిర్వాహకులపై చర్యలు తీసుకున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు పేర్కొన్నారు.

## ఉస్మానియాలో.. పాము కలకలం



ఉస్మానియా దవాఖాన పాత భవనంలోని డాక్టర్స్ క్యాంటీన్ వద్ద తిరుగుతున్న పామును పట్టుకున్న స్నేక్ సొసైటీ సభ్యుడు గణేశ్

### పట్టుకున్న స్నేక్ సొసైటీ సభ్యుడు గణేశ్

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 22 : ఉస్మానియా దవాఖాన పాత భవనం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని డాక్టర్స్ క్యాంటీన్ వద్ద పాము కలకలం రేపింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు మూసీ నదిలో నుంచి కొట్టుకువచ్చిన పాము శనివారం రాత్రి డాక్టర్స్ క్యాంటీన్‌లో ప్రత్యక్షమై అందరినీ కలవరానికి గురిచేసింది. పాము అక్కడే తిరుగుతుండటంతో విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది భయంతో పరుగులు తీశారు. డాక్టర్స్ క్యాంటీన్ పక్కనే ఉన్న గదిలో శిథిలావస్థకు చేరిన స్ట్రెచర్లు, వీల్ చైర్స్, ఇతర పరికరాలను కొంత కాలంగా నిల్వ చేశారు. క్రమంగా వ్యర్థాలు పెరుగడంతోనే తరచూ పాములు వస్తున్నాయని పలువురు వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తించిన సిబ్బంది క్యాంటీన్‌కు తాళం వేసి... స్నేక్ సొసైటీ సభ్యుడు గణేశ్‌కు విషయం చెప్పారు. వెంటనే గణేశ్ అక్కడికి చేరుకొని పామును సంచిలో బంధించి తీసుకెళ్లారు. సాధారణంగా పాము కాటు వేస్తే వైద్య చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు వస్తారు. కానీ, దీనికి భిన్నంగా ఉస్మానియాలోనే పాములు తరుచూ సంచరిస్తుండటంతో వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు, రోగి సహాయకులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.



## కూలిన నాలా రిటైనింగ్ వాల్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 22 : ఆనంద్‌నగర్ కాలనీలోని విశ్వేశ్వరయ్య భవన్ రోడ్డులో ఉన్న నాలా రిటైనింగ్ వాల్ కూలిపోయింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి నాలాలోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. నాలాలో చుట్టు పక్కల వారు పెద్ద ఎత్తున వ్యర్థాలు వేయడంతో నీరు పోయే దారి లేక బ్యాక్ వాటర్ బలంగా రావడంతో వాల్ కూలిపోయింది. దీంతో దానికి ఆనుకొని పార్కింగ్ చేసిన వాహనాలు నీటిలో పడిపోయాయి. నాలాల్లో వ్యర్థాలు వేస్తున్నా.. జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే నీరు ముందుకు వెళ్లకుండా వరద ఉధృతితో రిటైనింగ్ వాల్ కూలిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



## చమ్కీల అందం

సినీనటి కీర్తి సురేశ్ ఆదివారం నగరంలో సందడి చేశారు. ఆర్టీసీ ఎక్స్‌రోడ్‌లో మాంగళ్య షాపింగ్ మాల్‌ను ప్రారంభించి.. అనంతరం వస్త్రాలను పరిశీలించారు. ఆమెను చూసేందుకు అభిమానులు తండోపతండాలుగా వచ్చారు.